# ఆయురారోగ్య సిద్ధ్యర్థం

-గంటి భానుమతి

ఆ రోజు ఆదివారం.

ఆఫీసు లేదు కాబట్టి, తీరిగ్గా, చిక్కటి కాఫీని, అతి మెల్లగా తాగుతూ, పేపరు చూస్తున్నాను.

నేను ప్రత్యేకంగా లీలని చూడకపోయినా, అటూ ఇటూ నడుస్తోంది. అది ఆమె వాకింగ్.

లీల నా భార్య. పొట్టిగా, ఓవర్ వెయిట్‌తో ఉంటుంది. తలెత్తి పక్కగా చూశాను.

ఎరుపు రంగు పంజాబీ డ్రెస్, తెల్ల వోణీని, ఓ భుజం మీద నుంచి లాగి, నడుం చుట్టూ చుట్టింది.

నెత్తికి ఎరుపు నలుపు రంగులతో ఉన్న బొచ్చు తువ్వాలుని చుట్టుకుంది.

రెండు చేతులు వెనక్కి పెట్టుకుని అటూ యిటూ పచార్లు చేస్తున్న ఆమెను చూస్తుంటే హఠాత్తుగా నెపోలియన్ లాగా అనిపించింది.

పాపం! ఇలాగే సెయింట్ హెలీనాతో చచ్చిపోయే ముందు తిరిగి ఉంటాడు.

నెపోలియన్ అంటే నాకు యిష్టమని, ఆయనే నా ఆదర్శం అని నేను అనుకోను.

ఎలాంటి పెద్దమనుషులకైనా, ఎలాంటి దానికయినా ఎక్కడో ఒకచోట ఫుల్‌స్టాప్ ఉంటుందన్న చిన్న, అందరికీ తెలిసిన ఫిలాసఫీ బోధించే 'వాటర్‌లూ' మాత్రం నచ్చింది.

నడుస్తున్న నెపోలియన్‌ని "యువర్ మెజెస్టీ!" అని సంబోధించకుండా 'సర్' అని సంబోధించి మనస్సుని డిస్టర్బ్ చేసినట్టుగా, నా పఠనానికి అంతరాయం కలిగించింది, ఠపీమని పడ్డ ఓ పుస్తకం.

"ఏంటిటీ అప్రజాస్వామికం?" అంటూ తల ఎత్తి చూశాను.

లీల, బొచ్చు తువ్వాలు తీసేసింది. జుట్టుని గాలికి వదిలేసింది. సన్నటి, తెల్లగా చెమట ముత్యాలు నుదుటి మీద, ముక్కు మీద, చెవుల పక్కగా మెరిసిపోతున్నాయి.

ఏంటిటన్నట్టుగా కళ్ళెగరేశాను.

ఏం మాట్లాడకుండా పుస్తకాన్ని ఇంకొంచెం ముందుకు తోసింది. పుస్తకం వైపు చూశాను.

అదేదో దేశ జ్యోతిష శాస్త్రం. సింబాలిక్ ఫెంగ్ షుయ్.

రెండు పేజీలు తిప్పాను. పూర్తిగా అర్థం కాకపోయినా ఏదో జ్యోతిషం, దానికి సంబంధించిన పుస్తకం అయి ఉంటుందనిపించింది.

కొంచెం భయపడ్డాను.

అయినా అర్థంకానట్లు ఏంటిటన్నట్లు సైగ చేశాను.

మనోహరంగా నవ్వింది. నలభై దాటినా చెదరని అందం. ఆ నవ్వే నన్ను కట్టేస్తుంది.

"మన ఇంట్లో, మనమంతా, ఆరోగ్యంతో, అదృష్టంతో అష్టైశ్వర్యాలతో తులతూగుతూ ఉండాలంటే ఏం చెయ్యాలో..."

చిర్రెత్తుకొచ్చింది.

"ఆర్నెల్ల క్రితం ఇలాంటిదేదో చెప్పి, ఆరువేలు లాగావు. నీకు గుర్తుందో లేదో కానీ, నాకు మాత్రం బాగా గుర్తుంది... ఇంకా అందులోంచి తేరుకోనేలేదు... ఇప్పుడు ఇదోటా... ఏం కొనాలో కూడా రాశాడా..."

"ఆс... మరి రాయడా!" అంది భుజాలెగరేసి తలని ఓ వైపుగా వాల్చి అంది.

---

## గ్లోబల్ విలేజ్

ఔను...
ఇప్పుడు ప్రపంచం ఒక కుగ్రామమే
గౌరవింపబడే భాష ఆంగ్లమే
చదవాల్సిన విద్య కంప్యూటరే
ఆడాల్సిన ఆట క్రికెట్టే
తినాల్సింది పిజ్జా బర్గర్లే-
సంగీతమా?
సందేహం దేనికీ? పాప్ మ్యూజిక్కే!
నాట్యమా? డిస్కో డ్యాన్సుని అర్థం కాలేదా?
సంస్కృతి అంటే... అమెరికన్ సంస్కృతే!
భూతల స్వర్గమేదని అమాయకంగా అడుగుతారేమిటి?
ప్రపంచ కుగ్రామం దారి ఎటూ? అనడుగుతున్నారా?
ఆల్ రోడ్స్ లీడ్స్ టు అమెరికా-

-డా॥ ఎస్వీ సత్యనారాయణ

---

గుండెల్లో అశాంతి. అనారోగ్యం అప్పుడే మొదల యింది.

"మరి అప్పుడు చేయించిన పూజలు, కొన్ని ఉంగ రాలు, రాళ్ళు అవీ... వాటికి విలువ లేదా! వాటికేం పవరు లేదా?"

"అది వేరు. ఇది వేరు. ఇది చైనా వాళ్ళ శాస్త్ర ప్రకారంగా ఇంట్లో సుఖశాంతులు, భోగభాగ్యాలతో యిల్లు తులతూగే విధానం..."

లోపలి పేజీలో ధర చూశాను. యాభై రూపా యలు.

ఓ యాభై రూపాయల్లో ఇంట్లో శాంతిని, ఆరోగ్యాన్ని, ఆయుష్షుని పెంచడానికి, ప్రసాదించ డానికి కంకణం కట్టుకున్న ఆ రచయితని మనస్ఫూర్తిగా అభినందించాను.

ఉత్సాహం పెంచే కాఫీ నా మీద బాగా పని చేసింది. ఉత్సాహంగా లీలని చూశాను.

పుస్తకం మూసేసి ముందుకి మెల్లగా జరిపాను.

"ఇంతకీ యిందులో ఏఁవుందేమిటీ?"

"ఏ వస్తువు ఎక్కడ ఎలా పెడ్తే, యింట్లో శక్తులు ఎలా పనిచేస్తాయో, సుఖశాంతులు ఎలా వస్తాయో..."

"మా అమ్మ కూడా యిలాగే చెప్పేదేమో నీకు..."

"సరేలెండి, ఇప్పుడు మీ అమ్మగారి సంగతే చెప్పుకోవాలి... ఆవిడ ఓ చాదస్తం మనిషి..."

"ఇది శంఖంలో పోసిన తీర్థం..."

ఒక్కసారి లేచింది. కుర్చీని బర్రున వెనక్కి బలంగా తోచింది.

"ఇదే నాకు నచ్చదు. ప్రతీదానికి నెగెటివ్... ఆ యాటిట్యూడ్ మంచిది కాదు. అన్నింటికీ వాదన..."

లీల కోమలమైన భావాలకి కానీ, సున్నితమైన మనస్సుకి కానీ, బాధ కలిగించదలుచుకోలేదు.

"అది కాదు లీలా... నే చెప్పేది కాస్త విను... ముందు కూచో... లీలా... లీ... లా..."

ఆగిపోయింది.

"అవును... నా పేరు లీ... ఇవాళ నుంచి లీ... అలాగే పిలవండి... లీ..." అంది గర్వంగా.

"లీ యా... అదేం పేరు? బ్రూస్ లీ లాగా..."

ఆమె మొహం ఒక్కసారిగా వెలిగింది.

"లీ... చైనా వాళ్ళ పేరు... అలా 'లీ' అని అం టూంటే ఓరకమైన శక్తి అలా అలా ప్రవహించి ఒంట్లోకి ప్రవహిస్తోంది. ఏదీ... మళ్ళా అనండి, లీ... లీ... ఓ లాంటి తరంగాలు చూడండి ఎలా వ్యాపిస్తున్నాయో... కదా!..." అంటూ ఉత్సాహంగా చూసింది.

చుట్టూ చూశాను, ఏం కనపళ్ళేదు.

"ఎక్కడా!"

"హుఁ... బేసిక్ సైన్స్ తెలీదా! వైబ్రేషన్స్ ఎక్కడైనా కనిపిస్తాయా! అది ఓ ఫీలింగ్... అది అనుభవిస్తాం... ఆనందంలాగా" తన్మయంగా చెప్పుకుపోతోంది.

నోరు తెరుచుకుని ఆమెనే చూస్తూండి పోయాను.

ఒక్కసారిగా నా మొహం చూసి, ఆగింది.

"నాకు తెలుసు, మీలో ఆలోచనలు ఏవిధంగా ఎటువైపు వెళ్తున్నాయో... అర్థం చేసుకోగలను... ఈ శాస్త్రంలో నకారాత్మకమైన ఆలోచనలు అసలు ఉండకూడదు. దాన్ని మనసులోంచి తీసి పారేయండి. అంతా సకారాత్మకమైన ఆలోచనలే ఉంటాయి. అప్పుడే దివ్యశక్తులు యింట్లో ఉంటాయి... ఇప్పుడే ఓ క్షణంలో

## అద్దం...!

**అ**మ్మ అద్దంలో...
చందమామను చూపిస్తే
చిన్నారులకు అదొక విచిత్రం...!
అద్దంలో మన అందాన్ని
చూసుకుంటూ పొందే...
ఆనందం అనిర్వచనీయం...!
మన వేష భాషలకు అద్దం
పలు రూపాల సమగ్ర చిత్రం...!
మన ఆశయాలకు నిదర్శనం
అది అద్దంలో సాక్షాత్కారం...!
ఎడమొహం.. పెడమొహం...
అది అద్దంలో బొమ్మా.. బొరుసులు...!
వరూధిని అందం...
శృంగారసోయగాల రూపం...
అది అద్దంలో నిక్షిప్తం...!
మన మనోభావాలకు అర్థం
అద్దంలో ప్రతిఫలించే విశ్లేషణం...!
అద్దం అందానికే కాదు పరిమితం
అదొక నానార్థాల సంకలనం...!
అక్రమార్కుల అవినీతి...
కథనాలకు అదొక భూతద్దం...!
బడుగు వర్గాల జీవన చిత్రానికి
అది అద్భుతమైన ఓ నిలువుటద్దం...!

—తంగెళ్ల పాండురంగశర్మ

వస్తా..." అంటూ గదిలోకి వెళ్ళి ఓ బాగ్ తీసుకొచ్చింది.

బాగ్‌లోంచి పుస్తకాలు ఏవో బొమ్మలు, గుర్తులు ఒక్కొక్కటీ తీసి టేబుల్ మీద పెట్టింది.

"చూడండి! ఇదిగో... ఈ పుస్తకాల్లో మన సమస్యలకి అంటే సాధారణ సమస్యలకి, సందేహాలకి సమాధానాలున్నాయి. ఏ బొమ్మలు ఎక్కడ పెట్టాలో, ఏ పువ్వులు ఏ రంగుది ఎక్కడ ఉంచాలో అన్నీ వివరంగా ఉన్నాయి..."

ఆమె మాటలు అర్థంకాని చైనీస్, జాపనీస్‌ల్లాగా అనిపించాయి.

"ఈ లాఫింగ్ బుద్ధాలున్నాయి చూడండి... ఇవి అదృష్టాన్ని తెస్తాయి" అంటూ వివిధ పోజుల్తో ఉన్న వాటిని చూపించింది.

బుద్ధా అంటే తపస్సు చేసుకుంటూ, కళ్ళు మూసుకున్న విగ్రహమే తెలుసు. వీరు వేరా! లేక వారూ వీరూ ఒకరేనా?

"ఈ చిల్లి కాణీలున్నాయి చూడండి, వీటిని మీ పర్సులో పెడ్తే బోలెడు డబ్బు... వద్దంటె డబ్బు..." అంటూ ఓ ఎర్ర దారానికి మూడు చిల్లికానీ ల్లాంటి చైనా కాసుల్ని చూపించి నా పర్సులో పెట్టడానికి వెళ్ళింది.

ఆ రోజు తర్వాత తరచూ ఏదో ఒక కొత్త వస్తువు కనపడేది. ఏవో గీతలు, సింబల్స్ ఉన్నవి గోడలకి కనపడేవి.

ఓ గాజు జాడి, బంగారు రంగు చేపల్తో ఉన్నది ముందు గదిలో కిటికి పక్కగా ఉంచింది.

నోట్లో రూపాయ బిళ్ళ ఉన్న ఓ మూడు కాళ్ళ కప్పని గుమ్మం పక్కగా ఉంచింది.

ఓ ఆదివారం పొద్దున్న తీరిగ్గా బాల్కనీలో కూచుని కింద వచ్చేపోయే జనాన్ని చూస్తూ, కాఫీ తాగుతున్నాను.

"ఒక్కోసారి యిలా రండి, ఈ విండ్ చైమ్స్‌ని ఈ నార్త్ వెస్ట్‌లో పెట్టమన్నాడు... నార్త్ వెస్ట్ అంటే ఏ మూల...? చెప్పండి."

"అసలు మనింట్లో తూర్పేది?"

"బయటికెళ్ళి చూడండి, సూర్యుడెక్కడున్నాడో..."

"అతి కష్టంమీద ఆ నార్త్ వెస్ట్‌ని కొలంబస్ అంత గర్వంగా కనుక్కున్నాం... హమ్మయ్య... కట్టేయండి. ఇవి ఎంతో అదృష్టాన్ని తెస్తుంది. ఏడు గొట్టాలున్నది పడమర వైపుగా పెట్టాలిట. అది యింకా మంచిదిట... ఈసారి దాన్ని కొంటాను..." అంది ఉత్సాహంగా, ఆనందంగా...

"లీ... ఒక్కటడుగుతాను... ఇంత డబ్బు పెట్టి ఇన్ని కొన్నావు కదా... నీకేమయినా మార్పు కనపడుతోందా?"

ఆ చూపుకి శక్తి ఉంటే నేనేమయ్యి ఉండేవాడినో...

"వ్యంగ్యమా?"

తడబడ్డాడు.

"ఏం? ఈ పుస్తకం రాసినవాడు, అనుసరిస్తున్న మేమంతా ఓ పిచ్చివాళ్ళల్లాగా, వెఱ్ఱివాళ్ళల్లాగా కనపడ్తున్నామా! దీనికి, మార్పు రావాలంటే, వెంట వెంటనే సినిమాల్లోలాగా కనపడాలా! ముందు మీలోని నెగెటివ్ ఆలోచనల్ని తీసెయ్యండి. అసలు యిప్పటికే ఈ నెగెటివ్ ఫోర్స్‌లు లోతుల్లోకి చొచ్చుకుపోయి ఉన్నాయి. అవి అంత తొందరగా బయటికి పారిపోతాయా! కూకటి వేళ్ళతో వాటిని లాగి తీసి పారేయడానికి, యంగ్ శక్తులు ఈ యింట్లో ఉండడానికి సమయం పడుతుంది. ఇదేమయినా మాంత్రికుడి దండమా! హాం ఫట్ అని ఆ కర్ర తిప్పేయగానే మార్పులు జరిగిపోవడానికి... మార్పు రావాలంటే సమయం పడుతుంది...

నా దగ్గర జవాబేమీ లేదు. ఆమె లాజిక్‌లో అర్థం ఉంది. ఇంక ఎలా వాదించడం? అది నా వెఱ్ఱితనం...

ఇంతవరకూ బతికిపోయాను.

జూడో కరాటేల వైపు లీల మనసు వెళ్ళలేదు.

ఈ విధంగా ఫెంగ్ షుయ్ మా యింట్లో యిష్టా రాజ్యం లీల నేతృత్వంలో చేస్తుంటే కొన్ని నెలలు గడిచాయి.

ఆలివ్ కొమ్మల్ని పట్టుకోకపోయినా శాంతి కాముకుడిని, కాబట్టి ఎందుకు? అని ప్రశ్నించడం మానేశాను.

ఓ రాత్రి- గాలీ వానా- వర్షానికి కరెంట్ యథా ప్రకారంగా పోతే, యథా ప్రకారంగానే కొవ్వొత్తిని భోజనాల బల్ల మీద మధ్యలో ఉంచి భోంచేస్తున్నాం. పిల్లలూ, మేము.

ఒక్కసారి భళ్ళున శబ్దం అయింది.

ఏదో గాజుది పగిలింది అని అర్థం అయింది. శబ్దం ముందు గదిలోంచి వచ్చినట్టుగా అనిపించింది.

"మమ్మీ! ఈ ఇంట్లోని నూక్ అండ్ కార్నర్ నీకు బాగా తెలుసు. అది ఏంవిటో, ఎక్కడుందో, ఆ శబ్దం దేనిదో నీకే బాగా తెలియాలి... కదా డాడీ!..." అంది మా అమ్మాయి.

"అమ్మో!" అంటూ ఏదో గుర్తు వచ్చినట్లు లేచింది. గబుక్కున కుర్చీని వెనక్కి తోసింది.

"వామ్మో? నా గోల్డెన్ ఫిష్... జార్ పడి ఉంటుంది..." అంటూ ఆ ఎంగిలి చేత్తోనే విసా విసా నడిచింది. చీకటిని లెక్కచేయకుండా అదే స్పీడ్‌తో ముందుకు వెళ్ళింది.

"టార్చి లైట్ తీసుకెళ్ళు" అన్నాడు వెనకనుంచి

నా మాట పూర్తి కాకుండానే టీపాయ్ జరిగిన శబ్దం, దభీమని పడ్డ శబ్దం, అమ్మా! అన్న లీల గొంతు క్రమాలంకారంలో వినబడ్డాయి.

అందరం గాబరాగా లేచాం.

"వెధవ ప్పీనుగ కరెంట్ లేదు. ఈ కరెంట్ ఇప్పుడే పోవాలా" అని అంటూండగానే కరెంట్ వచ్చింది.

డ్రాయింగ్ రూంలోకి వచ్చిన మాకు కనిపిస్తున్న దృశ్యాన్ని ఆకళింపు చేసుకోడానికి అరసెకండు కూడా పట్టలేదు.

కిటికీకి దగ్గరగా, స్టూలుపై ఉన్న గాజు జాడి కింద పడింది. తెరచాపలాగా ఎత్తుగా పైకి లేచి ఎగురుతున్న కిటికీకి ఉన్న తెర జరిగినదంతా చెప్పింది.

"లేవలేకపోతున్నాను. నన్ను లేవదీయండి" దాదాపు ఏడుస్తున్నట్లుగా అంది.

ముందుకొస్తున్న పిల్లలిద్దర్నీ వారించాను.

"మీరు రాకండి. అక్కడే ఉండండి. అదిగో, ఆ చేపలు గిలగిలా కొట్టుకుంటున్నాయి. ఇదిగో ఇక్కడంతా గాజుముక్కలు. నా కంటె చెప్పులున్నాయి, నేను అమ్మని తీస్తాను" అంటూ పిల్లలతో అనీ అనగానే, వాళ్ళిద్దరూ చెప్పులు వేసుకుని గబగబా వచ్చారు.

లీలని ముగ్గురం కలిపి మంచం మీదకి చేర్చాం.

రెండు కాళ్ళు వాచాయి. మూడు రోజులు వేడినీళ్ళ కాపడం పెట్టాము. నాలుగుచోట్ల ఎక్స్-రే తీయాల్సి వచ్చింది. ఫ్రాక్చర్ నాలుగుచోట్ల అయింది. ఓ మోచేయి, మణికట్టు, కాలి వేలు, మడమ.

ఆస్పత్రిలో మూడు నెలలు, ఓ లక్ష రూపాయలకి రెక్కలొచ్చాయి.

ఈ హడావుడిలో ఫెంగ్ షుయ్‌ని మర్చిపోయింది లీల.

ఇది వాటర్ లూ అని అనుకోవడానికి వీలుందా! ఆలోచనలో పడ్డాను. జరిగేది జరగక మానదు, అన్ని శాస్త్రాలు ఈ కర్మ సిద్ధాంతం ముందు తల ఒగ్గుతాయి అన్న చిన్న ఫిలాసఫీ ఆలస్యంగా అయినా లీలకి అర్థం అయింది. ■

# తరగని నిధులు

ఆహ్వానిస్తే వచ్చేవికావు అనుభవాలు.
అవి పరిస్థితుల సంఘర్షణల్లోంచి
స్వయంగా ఉబికొస్తాయి.
కొన్ని మాయని గాయాల్లా మిగిలిపోతాయి.
మరికొన్ని తీయని ఊర్పుల తీగలపైన
సచేతనంగా సాగిపోతాయి.
అనుభవాలు మానసిక సంపదలు.
ఎన్నాళ్లు మళ్లీ మళ్లీ మననం చేసుకున్నా
అవి తరగని నిధులు.
వయోభేదం లేని సార్వకాలిక సత్యాలు.
పసితనం పాదుల్లో మొలుస్తాయి
పడుచుతనం పొంగుల్లో మెరుస్తాయి
ముసలితనం క్రీనీడల్లో పారాడుతాయి.
అనుభవాల పరంపరలను
అక్షరాల్లోకి ఎత్తిచూపగలిగితే
అవే ఆత్మకథలవుతాయి.
జీవితయాత్రలో
పదగతులు చతికిలబడిపోయినప్పుడు
అడుగులకు రెక్కలొచ్చి ఎగిసిపోయిన
ఒకనాటి ఉద్విగ్న సంఘటనలను
ఒక్కసారి స్మరించుకుంటే
భుజాలు నిక్కపొడుచుకుంటాయి.
ఆ స్మృతులే తదనంతర పురోగతికి
వినూతన స్ఫూర్తినిస్తాయి
జ్ఞాపకాల పేటికలు
ఏమాత్రం చెక్కుచెదరనంత కాలం
అనుభవాల నిక్షేపాలు భద్రంగా ఉంటాయి.
ఎన్నిసార్లు వినియోగించుకున్నా
అవి అక్షయంగానే ఉండిపోతాయి.
అదుగో
ఇంతలోనే జ్ఞాపకాల చేతులు
నా మేధా కవాటాన్ని తడుతున్నాయి.
తెరమరుగైన ఏయే అనుభవాలను
తీసుకొస్తాయో చూద్దాం.

–డా॥ సి.నారాయణరెడ్డి